క్లుప్తంగా

108 వాహనం కేటాయించాలి

మొగుళ్లపల్లి: మండలానికి 108 వాహనాన్ని కేటాయించాలని సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 25 గ్రామాల్లో ప్రజలు ఆపద సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల మండల కేంద్రంలో నుంచి 108 వాహనం వచ్చేసరికి సమయం సరిపోక అత్యవసర పరిస్థితిలో బాధితులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి విరాళం

రేగొండ: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ముస్లింల ఆధ్వర్యంలో ఉన్న సుమారు 3 గుంటల భూమిని విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఆ భూమిలో ఉన్న తాటి చెట్లను తొలగించడానికి గీత కార్మికులు ఒప్పుకున్నారు. దీంతో వారికి గ్రామస్తులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం



భూపాలపల్లి అర్బన్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో పదవులు పొందిన సందర్భంగా రెవెన్యూ అధికారులను మంగళవారం తోటి ఉద్యోగులు సన్మానించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సయ్యద్ అజారుద్దీన్(ఆర్ఐ), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇమామ్‌బాబా షేక్(డీటీ)లను భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ అంజలి, ఆర్ఐ రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ముందస్తు అరెస్ట్



రేగొండ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మండలంలోని ఆశవర్కర్లు హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మైస రజిత, కల్పన, హసీనా, సుభద్ర, స్వప్న, సంగీత పాల్గొన్నారు.

మ్యాదరి సునీల్‌కు అవార్డు



చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన కవి, రచయిత మ్యాదరి సునీల్ వివింటేజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి సూపర్ స్టార్ రిలికిస్ట్ అచీవ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డు అందుకున్నాడు. హైదరాబాద్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ ప్రముఖుల చేతుల అందుకున్నట్లు సునీల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఈవెంట్స్ సీఈఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం అందించారు. మండల కేంద్రానికి చెందిన రమేశ్ ఫోన్ పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు.

టీఆర్ పీఎస్ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన పలువురికి అవకాశం కల్పించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. టీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తౌటం ప్రభాకర్, కార్యదర్శిగా భాగవతం భిక్షపతి, జాయింట్ సెక్రటరీ గాదె రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అడ్డగట్ల శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొలిపాక ప్రసాద్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెందిన నాయకులకు రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడంపై ఆ కమిటీ జిల్లా కన్వీనర్ ఎలగొండ రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం

- అంకుషాపూర్‌లో ఆకట్టుకుంటున్న పార్క్
- ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ



అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనం

టేకుమట్ల: పల్లెల్లో పచ్చదనం నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంతో పల్లెల్లో పచ్చదనం నిండుకుంటోంది. గతంలో పట్టణాలలోనే పార్క్‌లు ఉండేవి, కాని గత రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో సైతం పార్క్‌లు ఏర్పాటు చేయాలనే కృషితో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగిస్తున్నాయి. అందులో భాగంగానే మండలంలోని అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనం టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డులో ఉండగా పార్క్‌లో సుమారు 20 రకాల మొక్కలను నాటగా ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మండలంలోనే ప్రత్యేక గుర్తింపు...

మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా అన్ని పల్లె ప్రకృతి వనాలు గ్రామాల్లో, గ్రామ సమీపాల్లో ఏర్పాటు చేయగా అంకుషాపూర్ పల్లె ప్రకృతి మాత్రం గ్రామానికి సుమారు 3కిలో మీటర్ల దూరంలో టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన పార్క్ మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. వాహనదారులు కాసేపు పార్క్‌లో సమయాన్ని గడిపి వెళ్తున్నారు. స్వచ్ఛమైన వాతావరణం, విశాలమైన స్థలంలో గత సంవత్సరం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

నర్సరీలో ఎన్నో రకాల మొక్కలు..

పల్లె ప్రకృతి వనం పక్కనే నర్సరీని ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షిస్తూ, పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. సాధారణంగా పలు ప్రాంతాల్లో మొక్కలను కొనుగోలు చేసి జూన్‌లో వనమహోత్సవంలో మొక్కలను నాటుతుంటారు. కానీ పార్క్‌లోని మొక్కలను నుంచి మరికొన్ని మొక్కలను నర్సరీలో నాటుతూ మొక్కలను పెంచుతున్నారు. అలా ప్రత్యేకంగా పెంచిన పలు రకాల మొక్కలను ప్రజలకు అందిస్తుంటారు. దాంతో మొక్కలను కొనుగోలు చేసే ఖర్చు తగ్గిందని పార్క్ నిర్వాహకులు, అధికారులు తెలుపుతున్నారు. ఇలా అన్ని గ్రామాల్లో మొక్కలను పెంచుతూ గ్రామాల్లో నాటితే పచ్చని పల్లెలుగా రూపొందుతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పార్క్ నిర్వహణపై దృష్టి



అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనంలో పలు రకాల మొక్కలను నాటి, నిత్యం వాటి ఎదుగుదలను పర్యవేక్షిస్తూ, వాటి సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాం. అందమైన పార్క్‌గా కొనసాగేందుకు వన సేవక్ సేవలు అభినందనీయం. అలాగే అందరి సహకారంతో పార్క్‌ను అందంగా తీర్చిదిద్దాం. మరికొన్ని రోజుల్లో మరిన్ని మొక్కలను నాటి మరింత అందంగా మార్చేందుకు కృషి చేస్తాం.

– బేతు కోమల, పంచాయతీ కార్యదర్శి, అంకుషాపూర్

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వ ఆనవాలు లేకుండా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లు పార్టీ నాయకులు ఆరోపించారు. కటకం జనార్ధన్, మేకల సంపత్‌కుమార్, హరీష్‌రెడ్డి, రాజు, బాలరాజు, చిరంజీవి, వెంకన్న పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో వృద్ధులకు చేగువేరా యూత్ సభ్యులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ.. మండలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగిందన్నారు. వృద్ధులు ఇబ్బంది పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వనం శ్రీనివాస్, నెల్లి వేణు, బమ్మ రవీందర్, నేత సాయి కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: కాటారం, మహాముత్తారం మండలాల్లోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో బోధించుటకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రత్యేకాధికారినులు సునీత, పుణ్యవతి మంగళవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. కాటారంలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సోషల్ బోధించుటకు, మహాముత్తారంలో హిందీ బోధించుటకు డిగ్రీ, బీఎడ్, టెట్ అర్హత కల్గినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహాముత్తారం కేజీబీవీలో పీ జీ అర్హత కలిగి పీజీ సీఆర్టీ కామర్స్, పీజీ సీఆర్టీ ఇంగ్లీష్ బోధించుటకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ కాల వ్యవధి మూడు నెలలు ఉంటుందని సీఆర్టీకి నెలకు రూ.18 వేలు, పీజీ సీఆర్టీకి నెలకు రూ.23వేలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 13లోపు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న అధికారులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని మహబుబ్‌పల్లితో పాటు, మండలంలోని గోర్లవీడులోని గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో 900 లీటర్ల చక్కర పానకం, 60లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోని ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో భూపాలపల్లి ఎస్సై రబ్బానీ, సిబ్బంది శ్రీకాంత్, రఘుపతి, బాలకృష్ణ, సునీల్, ముజాఫర్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజయ్య

కాటారం: మండలంలోని జాదారావుపేట గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఆత్మకూరి రాజయ్య హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఇప్పలిపల్లి నుంచి జాదారావుపేట చెరువు వరకు రహదారి నిర్మాణం, గూడూరు నుంచి విలాసాగర్ వరకు రోడ్డు నిర్మాణం, జాదారావుపేట చెరువు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరినట్లు రాజయ్య తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

కాళేశ్వరం: మహదేవపూర్ మండల స్థాయిలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం(టీబీ ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలో కాళేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కటుకు అలేఖ్య మొదటి బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం అన్నపూర్ణ తెలిపారు. ఆ విద్యార్థికి పాఠశాలలో గైడ్ టీచర్ సువర్ణ మంగళవారం అభినందించి జ్ఞాపిక అందజేశారు. వారితో ఉపాధ్యాయుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- ప్రొసైడింగ్ ఆఫీసర్ వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఎస్ఎస్‌తాడ్వాయి: ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ప్రొసైడింగ్ ఆఫీసర్ వెంకటనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక బృందాలు నిర్వహించిన తనిఖీలలోని లోపాలను గ్రామపంచాయతీల వారీగా వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు వంద రోజులు ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. రూ.66310లను గ్రామ పంచాయతీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి సాంబయ్య, ఎంపీడీఓ సుమనవాణి, ఎస్ఆర్పీ రమేష్, ఏపీఓ అనిల్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



సర్వే చేస్తున్న అధికారులు

వాజేడు: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈ సర్వే ప్రారంభం కాగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సెల్ ఫోన్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 8158 దరఖాస్తులను చేసుకోగా మంగళవారం ఒక్క రోజే మండల వ్యాప్తంగా 363 ఇళ్ల సర్వేను గ్రామ పంచాయతీ కార్య దర్శులు, సిబ్బంది పూర్తి చేశారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

- మండల ప్రత్యేకాధికారి శైలజ



రేగొండ: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ శ్వేత

టేకుమట్ల: విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల ప్రత్యేకాధికారి శైలజ, ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు విద్యార్థులు, యువతకు క్రీడలపై ఆసక్తిని పెంచుతున్నాయని అన్నారు. క్రీడలు శారీర ధారుడ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు పృధ్విరాజ్, సుమత, ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

కాటారం: మండల కేంద్రంలో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఈ క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ క్రీడాపోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంఈఓ సంజీవ్‌రెడ్డి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాటారం: క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని తహసీల్దార్ నాగరాజు, ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ఆవరణలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ అడ్డూరి బాబుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఎంపీఓ వీరస్వామి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేగొండ: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను తహసీల్దార్ శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యాన్ని, క్రీడా సంస్కృతిని పెంచుతుందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, క్రీడల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాల అధికారి రఘు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రభాకర్, ఎంపీఓ రాంప్రసాద్, ఎంజేపీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు విజిత, సురేశ్, ప్రతాప్, జయపాల్, జ్యోతి, రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: క్రీడలతో మానసికఉల్లాసంతో పాటు, శారీరక దృఢత్వం కలుగుతుందని మండల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ మహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పింగిళి విజయపాల్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంఈఓ లింగాల కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజయ్య, సందీప్, మహేష్, శ్రావణి, అజయ్, కార్తీక్, సుదర్శన్ పాల్గొన్నారు.



చిట్యాల: క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఎంపీడీఓ జయశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులందరూ పూర్తి వివరాల కోసం క్రీడల సమన్వయ కర్త ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి, ఎస్జీఫ్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వరూపారాణి, ఫిజికల్ డైరెక్టర్లు బండి ప్రసాద్, నూకల లింగయ్య, ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, శ్రీనివాస్, బండారి సదయ్య, గ్రామ కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



కాటారం: క్రీడాకారులతో అధికారులు



టేకుమట్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి శైలజ



మొగుళ్లపల్లిలో..

పాఠశాలలో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం అగ్రి బేస్ట్ ప్రొడక్ట్‌లపై ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో వివిధ రకాల పూలు, పండ్లు, గింజలు, చిరుధాన్యాలను ప్రదర్శించారు. వాటి వినియోగం, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, మండల ప్రత్యేకాధికారి శైలజ, ఏఎస్సై కుమారస్వామి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రసాద్, వెంకట్రావుపల్లి ప్రధానోపాధ్యాయులు రమేష్, పంచాయతీ కార్యదర్శి రామదాసు, రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



మల్హర్: జాతీయ మానవ హక్కుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు వేల్పుల మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యూరు గ్రామంలోని ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సంఘం నాయకులు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెన్నపురెడ్డి కార్తీక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిప్పల రజిత పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410